సాక్షి
పల్నాడు
సోమవారం । 28 । జూలై । 2025





## సత్తెమ్మ, అంకమ్మలకు సారె

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధి యర్రబాలెంలో సత్తెమ్మ, అంకమ్మ తల్లులకు ఆదివారం సారె సమర్పించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



## నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్య అన్నదానానికి గుంటూరు వాసి ఎల్. వెంకట సాయికృష్ణ రూ.51,116 విరాళమిచ్చారు.



## కాళికాదేవి అమ్మవారికి బోనాలు

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామ దేవత కాళికాదేవి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

# పల్నాట నెత్తుటి తూటా

## టీడీపీ అండ చూసుకుని తండ్రీకొడుకులను హతమార్చిన నిందితుడు

- రియల్టర్ల జంట హత్యల కేసులో రివాల్వర్ వినియోగంపై ఆధారాలు
- తుపాకీ సంస్కృతితో స్థానికంగా భయాందోళనలు
- కూటమి ప్రభుత్వం రాకతో పురివిప్పిన హత్యా రాజకీయాలు
- కేసును నీరుగార్చేలా వ్యవహరిస్తున్న ఇరు జిల్లాల పోలీసులు
- నిబంధనలకు విరుద్ధంగా రెండు జిల్లాల పరిధిలో కేసు దర్యాప్తు
- నిందితుడు బాదం మాధవరెడ్డి టీడీపీ వ్యక్తి కావడంతోనే ఇలా చేస్తున్నారని మృతుల తరఫు లాయర్ల ఆరోపణ
- దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని హైకోర్టులో పిటిషన్‌కు ఏర్పాట్లు

ఒకప్పుడు కక్షలతో రగిలిన పల్నాడు గడ్డపై గత ఐదేళ్లలో శాంతి, సామరస్యం వెల్లివిరిశాయి. సంక్షేమ పథకాలు చేతికంది, పిల్లలు ఉన్నత చదువులవైపు మళ్లడంతో అక్షర చైతన్యం పెరిగింది. పల్లె సీమలలో ఆరోగ్యకర వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హత్యా రాజకీయాలు పురివిప్పాయి. తాజాగా రియల్టర్ల మర్డర్లతో కిడ్నాపింగ్, రివాల్వర్ సంస్కృతి ప్రవేశించింది. పల్నాడును భయం గుప్పెట్లోకి నెట్టేసింది. జంట హత్యల కేసులో పోలీసుల తీరు అధికార టీడీపీ అడుగులకు మడుగులొత్తడంతో తమకు న్యాయం జరిగేనా అంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు.

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన జంట హత్యల ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో జరిగిన ఈ హత్యల వెనుక కూటమి ప్రజాప్రతినిధుల సహకారం ఉన్నట్టు స్పష్టమవుతోంది. బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కే వీరాస్వామిరెడ్డి, కేవీ ప్రశాంత్‌రెడ్డి తండ్రీకొడుకులు. గత బుధవారం చెల్లని చెక్కు కేసులో నరసరావుపేట కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన వారిని కోర్టు ఎదుట కిడ్నాప్ చేసి బాపట్ల జిల్లా పాతమాగులూరు వద్ద హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితులు నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో కిడ్నాప్ చేసేందుకు సాహసించిన తీరు, హత్యలు చేసిన వైనాన్ని పరిశీలిస్తే ప్రభుత్వంలోని పెద్దల అండ చూసుకొని బరితెగించినట్టు తెలుస్తోంది. కేసు నమోదులో కూడా పోలీసుల నిర్లక్ష్యం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోంది. నరసరావుపేటలో కిడ్నాప్ చేసిన దుండగులు 20 నిమిషాల వ్యవధిలోనే ఇద్దర్నీ హత్య చేశారు. ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మృతుల తరఫు న్యాయవాది నాగభూషణ్ ఇచ్చిన ఫిర్యాదుతో నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. మృతదేహాలు పాతమాగులూరులో లభ్యమైన కారణంగా సంతమాగులూరు పోలీసులు అక్కడ మర్డర్ కేసు నమోదు చేశారు. సాధారణంగా కంటిన్యూషన్ అఫెన్స్ జరిగినప్పుడు సంఘటన ప్రారంభమైన స్టేషన్ పరిధిలో నమోదైన కిడ్నాప్ కేసును మర్డర్ కేసుగా మార్చి దర్యాప్తు చేయాలి. కానీ జంట హత్యల కేసులో మాత్రం గత కేసులకు భిన్నంగా రెండు జిల్లాల పరిధిలోని పోలీసులు ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఇద్దరు స్టేషన్ అధికారుల మధ్య సమన్వయం లోపిస్తే కేసు నీరుగారే ప్రమాదం ఉంది. జంట హత్యల కేసులో ప్రభుత్వం ప్రారంభంలోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మృతుల తరఫు న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసుల తప్పిదాన్ని ఎత్తిచూపుతూ కేసు దర్యాప్తును సీబీఐకు బదిలీ చేయాలని హైకోర్టును ఆశ్రయించే ఆలోచన ఉన్నట్లు సమాచారం.




యువగళం పాదయాత్రలో భాగంగా లోకేష్‌కు స్వాగతం పలుకుతూ బాదం మాధవరెడ్డి ఫొటోతో ఆయన అనుచరులు వేయించిన ఫ్లెక్సీ (ఫైల్)

### టీడీపీ నేతలతో సంబంధాలు..

నరసరావుపేటలో కిడ్నాప్ చేసిన తండ్రీకొడుకులను బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పాతమాగులూరు పరిధిలో హత్య చేయడం వెనుక ముందస్తు వ్యూహం ఉందన్న ప్రచారం జరుగుతోంది. సంతమాగులూరు గ్రామానికి చెందిన నిందితుడు బాదం మాధవరెడ్డికి బాపట్ల, ప్రకాశం జిల్లాలలో అధికార పార్టీ నేతలతో సత్సంబంధాలు ఉన్నాయి. పల్నాడు జిల్లా పరిధి దాటగానే బాపట్ల జిల్లా ప్రారంభమైన 200 మీటర్ల దూరంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లో హత్యలు చేశారు. ముందస్తు పక్కా ప్రణాళిక ప్రకారం అక్కడి నుంచి పరారయ్యారు.



సీఎం చంద్రబాబుతో బాదం మాధవరెడ్డి (ఫైల్)

### మాధవరెడ్డి టీడీపీ నాయకుడే..

పట్టపగలు కోర్టు ప్రాంగణం ఎదుట ఇద్దర్ని అందరూ చూస్తుండగా కిడ్నాప్ చేసి అతి దారుణంగా హతమార్చడం రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం, పోలీసుల తీరుపై వస్తున్న విమర్శలను మరుగునపెట్టి.. ఎప్పటిలాగే ఈ ఘటనను కూడా వైఎస్సార్‌సీపీ నెత్తిన రుద్దేందుకు కుట్ర జరుగుతోంది. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న బాదం మాధవరెడ్డి గతంలో కొంత కాలం వైఎస్సార్‌సీపీలో ఉన్న విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. అయితే మాధవరెడ్డి ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నాడు? గత సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ కోసం పని చేశాడు? ఎవరి అండదండలతో ఇంత దారుణానికి ఒడిగట్టాడనే అంశాలను పరిశీలిస్తే అన్ని వేళ్లూ కూటమి ప్రభుత్వం వైపే చూపిస్తున్నాయి. సాధారణ ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబర్ 10వ తేదీన అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబును కలసి మద్దతిచ్చిన ఫొటోలను ప్రధాన నిందితుడు మాధవరెడ్డి తన సోషల్ మీడియాలో పెట్టుకున్నాడు. ఆ ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. దీంతోపాటు యువగళం పాదయాత్ర సమయంలో లోకేష్‌కు స్వాగతం పలుకుతూ మాధవరెడ్డి ఫొటోలతో అతని అనుచరులు వేసిన ఫ్లెక్సీలు ఏ పార్టీ వాడో చెప్పకనే చెబుతున్నాయి. ఈ వాస్తవాలను మరుగున పరిచేందుకు కొన్ని పచ్చ పత్రికలు పదేళ్ల క్రితం మాధవరెడ్డి ఉన్న పార్టీ ప్రస్తావన తీసుకువచ్చి ప్రభుత్వానికి మచ్చ లేకుండా చేసేందుకు తెగ ప్రయత్నిస్తున్నాయి. టీడీపీ నేతల అండ చూసుకుని మాధవరెడ్డే స్వయంగా కిడ్నాప్, హత్యల ఘటనలో పాల్గొన్నట్టు అర్థమవుతోంది. తండ్రీకొడుకులను మాధవరెడ్డి బలవంతంగా కారులో ఎక్కిస్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలలో నిక్షిప్తమయ్యాయి.

### రివాల్వర్‌తో బెదిరించి..

రియల్టర్ల కిడ్నాప్‌నకు నిందితులు తుపాకీ ఉపయోగించినట్టు తెలుస్తోంది. నిందితులు హత్యల తరువాత పారిపోతూ చిలకలూరిపేట వద్ద వదిలిన కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారులో లభించిన రివాల్వర్ పౌచ్ ద్వారా పోలీసులు ఈ నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. ఈ కారులో తుపాకీ పౌచ్‌తోపాటు హత్యలకు వినియోగించేందుకు తెచ్చిన ఓ కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారును చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తుపాకీ, కత్తులతో బెదిరించడం వల్లే తండ్రీకొడుకులు కిడ్నాప్‌నకు గురయ్యే సమయంలో తప్పించుకునే ప్రయత్నం చేయలేకపోయి ఉంటారని భావిస్తున్నారు.



రియల్టర్లను కిడ్నాప్ చేస్తూ సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న బాదం మాధవరెడ్డి (ఫైల్)

## న్యూస్‌రీల్

### వినియోగదారుల హక్కుల పరిరక్షణ కార్యాలయం ప్రారంభం



తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని ఎస్ఎస్ఆర్ ప్లాజాలో జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు కూడారి తిరుపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు పడుతున్న సమస్యలకు పరిష్కారం, హక్కులపై ఫోరం అవగాహన కల్పిస్తోందని తెలిపారు. వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై మంగళగిరిలో నూతనంగా ప్రారంభించిన జిల్లా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు బొమ్ము జస్వంత్‌రెడ్డి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు టి.రవికుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ప్రియారెడ్డి, యూత్ జిల్లా ఇన్‌చార్జి షేక్ రిజ్వాన్, యూత్ వింగ్ ప్రతినిధి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### యోగాలో లిమిట్‌లెస్ సెంటర్ విద్యార్థులకు పతకాలు




గుంటూరు వెస్ట్ (క్రీడలు): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అమరావతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని సుమేధ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి యోగసన పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని యోగా టీచర్ వంగా వెంకటేష్ తెలిపారు. 10–14 ఏళ్ల వయస్సు విభాగంలో గోహితకు కాంస్యం, 18–28 ఏళ్ల విభాగంలో పి.భార్గవికి స్వర్ణం, కాంస్యం, 28–35 ఏళ్ల విభాగంలో వి.వెంకటేష్‌కు రెండు స్వర్ణాలు, 35–45 ఏళ్ల విభాగంలో రేణుక రెండు బంగారు పతకాలు సాధించారన్నారు. యోగాసనాలతోపాటు ఆహార అలవాట్లు మార్పు చేసుకుంటే చక్కని ఆరోగ్యం సొంతం అవుతుందని తెలిపారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న వారికి లిమిటెస్ ఫిట్‌నెస్ సెంటర్ అధినేత నీలిమ అభినందనలు తెలిపారు.

### వైభవంగా గిరిజా కల్యాణం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం గిరిజా కల్యాణం వైభవంగా నిర్వహించారు. వామనాశ్రమ స్వామిజీ మాట్లాడుతూ గిరిజా కల్యాణం నిర్వహించడం వల్ల వివాహ దోషాలు తొలగిపోతాయని అన్నారు. త్వరగా పెళ్లిళ్ల జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఆది దంపతులు పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహంతో త్వరగా పెళ్లిళ్ల కావాలని ఆశీర్వదించారు. గిరిజా కల్యాణాన్ని వేద పండితులు (శ్రీకాళహస్తి) శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం దాదాపు 200 మంది యువతీ, యువకులకు తీర్థప్రసాదాలు అందించారు. తటపర్తి రాంబాబు, నేరెళ్ల హరి, ఎల్ఎస్ఆర్ ఆంజనేయులు, గుడివాడ రవీంద్ర, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ నిడమానూరు సురేష్, త్రిపుర మల్లు వాణి పాల్గొన్నారు.

### 582 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 582.90 అడుగులకు చేరింది. ఇది 291.3795 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 511, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 29,151, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల అవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 93,115 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

# చదరంగంలో చిచ్చరపిడుగు

## ఏడేళ్లకే జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న బాలుడు




కిరణ్ దంపతులను, జాషువా మ్యాగ్నస్‌ను సన్మానిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచర్ల రూరల్: పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్లుగా ఈ చిన్నోడు చదరంగంలో ప్రతిభ చాటుతున్నాడు. ఎత్తు వేశాడంటే ప్రత్యర్థి చిత్తు కావాల్సిందే. మాచర్ల పట్టణంలో ఉంటున్న చదరంగం కోచ్ కటారపు కిరణ్, మధుమతి దంపతుల కుమారుడు జాషువా మ్యాగ్నస్ చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం 2వ తరగతి చదువుతున్నాడు.

### చిన్ననాటి నుంచే..

తండ్రి నేర్పిన ఆటపై శ్రద్ధ పెట్టి నైపుణ్యాలను పెంచుకుంటూ జాషువా మ్యాగ్నస్ ప్రతిభ చాటుతున్నాడు. చిన్ననాటి నుంచే చక్కని సాధనతో ఆటపై పట్టు సాధించాడు. 2022లో తొలిసారిగా నాలుగేళ్ల వయసులోనే గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ –7 పోటీల్లో సత్తా చాటాడు. 2024లో ఆంధ్రా చెస్ శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో 3వ స్థానం సాధించాడు. నంద్యాలలో జరిగిన టోర్నమెంట్‌లో, గుంటూరులో రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. అండర్ –7 రాష్ట్ర స్థాయి పోటీల్లో 2వ స్థానం సాధించి ఏపీ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. 2024 మైసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తొలి స్థానం పొందాడు. ఏడేళ్ల వయసులోనే వరుసగా జాతీయ స్థాయి పోటీలకు మూడుసార్లు ఎంపికై చరిత్ర సృష్టించాడు.



అండర్ 7లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి బహుమతి అందుకుంటున్న జాషువా మ్యాగ్నస్

### కుటుంబ ప్రోత్సాహంతో...


బాలుడు చదువు, చదరంగాన్ని సమన్వయం చేసుకునేలా కుటుంబం సహకారం అందిస్తోంది. ఎక్కడ పోటీలు జరిగినా కుటుంబం మొత్తం వెళ్లి ప్రోత్సహిస్తోంది. జాషువా మ్యాగ్నస్ సోదరుడు శాన్లీ కూడా చెస్ ఆటగాడే. ఇరువురు ఇంట్లో సాధన చేయటం పోటీలలో ఎంతగానో ఉపయోగపడుతోంది. అనారోగ్యం పాలైనా టోర్నమెంట్ ఆడిన రోజులు కూడా ఉన్నాయని తల్లిదండ్రులు తెలిపారు. ప్రముఖ చదరంగ క్రీడాకారుడు మ్యాగ్నస్ కార్లసన్‌పై అభిమానంతో జాషువా మ్యాగ్నస్ అని పేరు పెట్టామన్నారు. ఆ పేరుకు ఏ మాత్రం తీసిపోకుండా చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నాడీ చిన్నారి. గతేడాది పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిలు జాషువా మ్యాగ్నస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జనవరిలో జరిగిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్ పోటీలలోనూ విజయం సాధించాడు. ఎప్పటికైనా మ్యాగ్నస్ కార్లసన్‌తో తలపడాలని ఈ చిన్నారి కోరిక. గ్రాండ్ మాస్టర్ కావటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడు.



జాషువా గెలుపొందిన బహుమతులు

# అప్రమత్తతతో డెంగీకి చెక్

- జిల్లాలో 50 కేసులు నమోదు
- అపోహలతో ప్రాణాలు పోయే ప్రమాదం
- కొద్ది జాగ్రత్తలతో జ్వరానికి అడ్డుకట్ట
- డెంగీ పేరుతో ప్రైవేటు వైద్యుల దోపిడీ



జిల్లాలో బాధితుల వివరాలు

| సంవత్సరం | బాధితుల సంఖ్య |
|---|---|
| 2021 | 447 |
| 2022 | 168 |
| 2023 | 375 |
| 2024 | 432 |
| 2025 | 50 (జూన్ వరకు) |

గుంటూరు మెడికల్: డెంగీ జ్వరం... ఈ మాట వినగానే జిల్లా ప్రజల్లో వణుకు పుడుతుంది. గతంలో అధికంగా కేసులు జిల్లాలోనే నమోదవ్వడంతో హెల్త్ ఎమర్జన్సీ సైతం ప్రకటించారు. డెంగీ జ్వరంతో మరణాలు కూడా సంభవించాయి. సాధారణంగా కొన్ని జ్వరాలు వచ్చిన కొద్దిరోజుల్లోనే తగ్గిపోతాయి. కొన్ని సరైన జాగ్రత్తలు తీసుకోని పక్షంలో ప్రాణాలు సైతం పోయే ప్రమాదం ఉంది. సాధారణంగా వర్షాలు కురిసే సమయంలో జ్వరాలు వస్తుంటాయి. కానీ మండుటెండల్లోనూ కేసులు నమోదవ్వడంతో ప్రజల్లో ఆందోళన ప్రారంభమైంది. ముఖ్యంగా సరైన అవగాహన లేకపోవడంతో పలువురు ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట జ్వర బాధితుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. డెంగీపై కొద్దిపాటి అవగాహనతో జాగ్రత్తలు తీసుకుంటే దాని బారిన పడకుండా ఉండొచ్చు.

### ఇవీ.. లక్షణాలు

పగటి పూట కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ జ్వరం వస్తుంది. వాంతులు, తలనొప్పి, కంటి గుడ్డు కదిలినప్పుడు నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అయినట్లు భ్రాంతి కల్గడం మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ఒంటిపై ఎర్రటి గుల్లలు ఏర్పడతాయి. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ఒక్కోసారి రక్తస్రావం జరుగుతుంది. ఎలీసా పద్ధతిలో రక్త పరీక్ష చేసి వ్యాధిని నిర్ధారణ చేస్తారు.

### అపోహలతో ప్రాణాల మీదకు..

డెంగీపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ పేరిట రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. కొంత మంది బొప్పాయి రసం తాగితే, బొప్పాయి తింటే ప్లేట్‌లెట్స్ పెరుగుతాయనే అపోహల్లో ఉంటున్నారు. దీంతో ఆస్పత్రులకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. డెంగీపై అవగాహనతో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరం బారిన పడకుండా ఉండొచ్చు.

### పట్టణాల్లో కేసులు అధికం

గ్రామీణ ప్రాంతాల్లో కంటే మున్సిపాలిటీలు, గుంటూరు కార్పొరేషన్ పరిధిలోనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది గుంటూరు నగరంలో 31 కేసులు నమోదయ్యాయి. నగరంలోని భాగ్యనగర్, బొంగరాలబీడు , బృందావన్ గార్డెన్స్, గోరంట్ల, కోబాల్డ్‌పేట, గుండారావుపేట, గుంటూరువారితోట, శారదాకాలనీ, ఆర్.అగ్రహారం, వసంతరాయ పురం, శ్రీనివాసరావు తోట, పాత గుంటూరు, ఎన్‌జీఓ కాలనీ, మంగళదాస్ నగర్, లాంచెస్టర్‌రోడ్, ఐపీడీకాలనీ, గుంటూరువారితోట, లాలాపేట, తదితర ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదయ్యాయి.

### దోమలు పెరిగే ప్రదేశాలివీ..

మంచినీటిని నిల్వ చేసే ప్రదేశంలో, వాడి పారేసిన వస్తువులు, నిలువ ఉండే నీటిలో దోమ పిల్లలు పురుగుల మాదిరి కదులుతూ ఉంటాయి. నీటిని నిల్వచేసే డ్రమ్ములు, తొట్టెలు, గాబులు, రుబ్బురోళ్లు, వాడి పారేసిన టైర్లు, టీ కప్పులు, ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి చిప్పలు, బొండాలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్ల వెనుక భాగాల్లో, పూల కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి సంపుల్లో ఈ దోమ లార్వాలు పెరుగుతాయి.



### ప్లేట్‌లెట్లపై అపోహలు వీడండి



ఎలాంటి జ్వరం వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గటం సహజం. అంతమాత్రానికే ఊరికే రోగులు కంగారు పడకూడదు. సాధారణంగా రక్తంలో 2 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. వీటి సంఖ్య 40 వేల కన్నా తక్కువగా ఉన్నప్పటికీ ప్రమాదం లేదు. డెంగీ మొదటి దశలో జ్వరం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కళ్లు ఎర్రగా మారతాయి. రెండో దశలో ప్లేట్‌లెట్స్ తగ్గటం, జ్వరం, వాంతులు, కాళ్ల వాపులు వస్తాయి. మూడో దశలో బీపీ తక్కువగా ఉండటం, ప్లేట్‌లెట్స్ తగ్గటం, శరీరంపై మచ్చలు ఏర్పడతాయి. నాలుగో దశలో రోగికి కామెర్లతోపాటుగా షాక్‌లోకి వెళతాడు. బీపీ తగ్గడంతోపాటు కిడ్నీల పనితీరు కూడా తగ్గిపోయి, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడతాయి. అవి పగిలి రక్తం బయటకు వస్తుంది. మూత్రంలో, దగ్గుతున్నప్పుడు కళ్లె ద్వారా రక్తం పడిపోతూ ఉంటే అప్పుడు ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి ఉంటుంది. నాలుగో దశను డెంగీ హెమరేజ్ షాక్ సిండ్రోమ్ అంటారు. మొదటి మూడు దశలలో ఎలాంటి భయాందోనలు చెందాల్సిన పనిలేదు.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, జ్వరాల స్పెషలిస్ట్, గుంటూరు.

### ఉచితంగా నిర్ధారణ పరీక్షలు



జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు కిట్ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నాం. కేసులు నిర్ధారణ జరిగితే సమాచారం ఇవ్వాలని, ప్లేట్‌లెట్స్ పేరుతో భయపెట్టవద్దని ప్రైవేటు వైద్యులందరికీ ఆదేశాలు జారీ చేశాం. ప్రతిరోజూ వైద్య సిబ్బందిని ప్రైవేటు ఆస్పత్రులకు పంపించి వివరాలు సేకరిస్తున్నాం. దోమల నివారణ చర్యల్లో భాగంగా గంబూషియా చేప పిల్లలను నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో వదిలాం. కేసులు నమోదైన ప్రాంతంలో యాంటీ లార్వా పద్ధతులు, ఫాగింగ్ చేస్తున్నాం. దోమల పెరుగుదలకు అపరిశుభ్రమైన వాతావరణమే ముఖ్య కారణం. దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు, వర్షపునీరు నిల్వలేకుండా చూసుకోవాలి. దోమల నుంచి రక్షణకు ఉదయం, సాయంత్రం సమయాల్లో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. నిద్రించే సమయంలో తప్పనిసరిగా దోమ తెరలు వాడటం చాలా మంచిది.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి, గుంటూరు.

## క్లుప్తంగా

### జిల్లా ఫ్లోర్ బాల్ ఎంపిక పోటీలు



వినుకొండ: పల్నాడు జిల్లా ఫ్లోర్‌బాల్ అండర్ -14, 19 బాలబాలికల ఎంపిక పోటీలు పట్టణంలోని లయోలా పాఠశాలలో నిర్వహించినట్లు పల్నాడు జిల్లా ఫ్లోర్ బాల్ ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 3న నరసరావుపేటలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో లయోలా స్కూల్ హెచ్ఎం అభినాష్, జిల్లా కార్యదర్శి కిషోర్, పీఈటీలు ఏడుకొండలు, కోటేశ్వరమ్మ, రవితేజ, వివిధ పాఠశాలల నుండి 100మంది బాలబాలికలు పాల్గొన్నారు.

### బుల్లెట్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు



యడ్లపాడు: జాతీయ రహదారిపై తిమ్మాపురం వద్ద బైపాస్ రహదారిపై ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల తెలిపిన వివరాలు.. మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన దొప్పలపూడి హనుమానా శాస్త్రి, దండా గోపి, మరొక వ్యక్తి కలిసి బుల్లెట్‌పై చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు ఆదివారం వెళ్తున్నారు. తిమ్మాపురం వంతెనపైనా మలుపు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బుల్లెట్‌పై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనం కూడా ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని 108లో గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌ని పోలీసులు పరిశీలిస్తున్నారు. వాహనంపై కూర్చున్న వారిలో మధ్యలో ఉన్న వ్యక్తి బుల్లెట్ హ్యాండిల్ పట్టుకున్నట్లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రైవేట్ నర్సరీలతో జర జాగ్రత్త

- ఏమాత్రం పొరపాటు జరిగిన రైతుకు తీవ్ర నష్టం
- నారు నాణ్యతలో రాజీ పడకూడదు
- ప్రైవేట్ నర్సరీల నిర్వాహకులు నిబంధనలను పాటించకుంటే చర్యలు
- జిల్లా వ్యాప్తంగా 380 మిర్చి సాగు ప్రైవేట్ నర్సరీలు

సత్తెనపల్లి: జిల్లాలో మిర్చి పంటలు సాగు చేసే రైతులు నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు నారు కోసం ప్రైవేట్ నర్సరీలపై ఆధారపడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది ప్రైవేట్ నర్సరీల నిర్వాహకులు నాసిరకం నారును రైతులకు అంటగడుతున్నారు. నర్సరీల నిర్వాహకుల మాటలు నమ్మి రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగుచేసిన రైతులు దిగుబడులు సక్రమంగా రాక, తెగుళ్ల బెడదతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా నారు కొనుగోలు సమయంలో మోసపోతే రైతుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. పైరు ఏపుగా పెరిగి ఎన్ని మందులు వాడినా దిగుబడులు రాక రైతులు నష్టపోతుంటారు. పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేట్ నర్సరీల నిర్వాకంతో రైతులు నష్టపోయిన సందర్భాలు అనేక ఉన్నాయి. అయితే రైతులు మోసపోకుండా ఉండేందుకు విత్తన చట్టం ప్రకారం నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. నిర్వాహకులు విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేస్తున్నారు? ఎలా పెంచుతున్నారు? రైతులకు ఎలా ఇస్తున్నారని? ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నారు. జిల్లాలో ప్రైవేట్ నర్సరీలు 380 నిర్వహిస్తున్నారు. ఉద్యాన శాఖ అధి కారులు పరిశీలించి లైసెన్స్ గడువు ముగిసిన నర్సరీలను వెంటనే రెన్యువల్ చేసుకోవా లని నర్సరీల నిర్వాహకులకు సూచిస్తున్నారు.



కంకణాలపల్లిలో మిర్చి నారు పెంచుతున్న నర్సరీ

### నిబంధనలు పాటించకుంటే చర్యలు



అనుమతులు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ప్రైవేట్ నర్సరీలపై చర్యలు తీసుకుంటాం. రైతులు నర్సరీలో నారు కొనుగోలు చేసే సమయంలో కంపెనీ రకం, లాట్ నెంబర్, తదితర పూర్తి వివరాలతో కూడిన రసీదు తీసుకోవాలి. అనుమతులు ఉన్న నర్సరీల నుంచి మాత్రమే రైతులు నారు కొనుగోలు చేయాలి. వీలైనంతవరకు రైతులే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి నారు పెంచుకోవాలి.

– ఎస్.సురేష్, ఉద్యానశాఖ అధికారి, సత్తెనపల్లి

### నర్సరీలు పాటించాల్సిన నిబంధనలు...

- నారు పెంచే నర్సరీ చుట్టూ ఇన్‌సెక్ట్ నెట్ ఉండాలి
- ఇన్‌సెక్ట్ నెట్‌కు ఎలాంటి చిల్లులు లేకుండా చూడాలి
- డబుల్ డోర్‌కు ఎలాంటి సందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- షేడ్ నెట్‌కు మూడు అడుగుల విస్తీర్ణం వరకు ఎలాంటి కలుపు, చెట్లు ఉండకూడదు
- నర్సరీ లోపల పసుపు రంగు జిగురు అట్టలు ఉంచాలి
- నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూరా ట్రాప్ క్రాఫ్ (బంతి మొక్కలు) వేయాలి
- ప్రతి బెడ్డుకు ముందు ఆ బెడ్డులో పోసిన నారును సూచిస్తూ కంపెనీ, వెరైటీ, నాటిన తేదీ మొదలగు వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలి
- నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన కంపెనీల బిల్లులు తీసుకోవాలి
- నర్సరీ కి సంబంధించిన ఏడు రిజిస్టర్ లలో పూర్తి వివరాలు నమోదు చేయాలి
- నర్సరీ లైసెన్స్ నెంబర్ ప్రింట్ చేసిన బిల్లులు మాత్రమే నారు కొనుగోలుదారులకు ఇవ్వాలి
- నర్సరీ పేరును సూచిస్తూ నర్సరీ బయట పెద్ద బోర్డును ఏర్పాటు చేయాలి

### తైక్వాండో పోటీల్లో 15 మందికి బంగారు పతకాలు



తెనాలి అర్బన్: గుంటూరు జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తెనాలి కేఎస్ఆర్ అకాడమి విద్యార్థులు 15 మందికి బంగారు, ఆరుగురికి వెండి, ఇద్దరికి కాంస్య పతకాలు లభించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను రేపల్లెలో ఈ నెల 19,20 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. వీరందరూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు. ఆదివారం అకాడమి ఆవరణలో క్రీడాకారులకు పతకాలు పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ఈదర వెంకట పూర్ణచంద్, వీరవల్లి మురళి, కుర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు మంత్రి అభినందనలు

తాడేపల్లి రూరల్: మంగళగిరికి చెందిన యువ స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్‌కు ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఉండవల్లిలోని ఆయన కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఏషియన్ రోలర్ స్కేటింగ్ సోలో డ్యాన్స్ సబ్ జూనియర్ విభాగంలో జెస్సీ రాజ్ సిల్వర్ మెడల్ సాధించినందుకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



రేకుల షెడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. మండలంలోని వెల్లటూరులో ఇటీవల కూల్చివేసిన నివాస గృహాలను ఆదివారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. బొల్లా మాట్లాడుతూ తెలుగుదేశం దుర్మార్గపాలన చేస్తోందని చెప్పారు. ప్రజలను రక్షించాల్సిన పాలకులు కక్ష సాధింపు చర్యలు చేపట్టారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఇదే స్థలంలో 50 ఏళ్ల నుంచి నివాసముంటున్నారని, రోడ్డుకి ఎలాంటి అడ్డంకులు లేకపోయినా వీరందరిని స్థానికంగా టీడీపీ నాయకుల ప్రోద్బలంతో కోర్టు ఉత్తర్వులు పేరుతో కూల్చివేయడం దారుణమని చెప్పారు. బాధితులు గంగనబోయిన నాగరాజు, మునేయ్యలకు చెందిన ఎద్దులు దొంగతనం చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. కూల్చివేత గురైన బాధితుల్లో నిరుపేదలు, చిరు వ్యాపారులు, సన్న, చిన్న కారు రైతులు, ఎస్సీ, బీసీలకు చెందిన వారు ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఎంపీటీసీ, సర్పంచి, వలంటీర్‌గా పనిచేశారని, ఇక్కడ నివాసముంటున్నారని కక్ష పూరితంగా కూల్చివేసినట్లు చెప్పారు. కూల్చివేత సమయంలో ఇల్లు ఖాళీ చేసే సమయం ఇవ్వలేదన్నారు. బాధితుల గోడు పట్టించుకోకుండా డబ్బులు బంగారం ఇష్టం వచ్చినట్లు లూటీ చేశారని ఆరోపించారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రైవేట్ కేసు వేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం అందించాలని, స్థానిక ఎమ్మెల్యే వీరందరికీ అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. రైతులకు న్యాయం జరగకపోతే న్యాయ పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే చెప్పారు.

# వడియరాజులను ఎస్టీ జాబితాలో చేర్చటం తమ కల

- వడియరాజులను ఎస్టీ జాబితాలో చేర్చటం తమ కల
- వడియరాజుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు బేబీరాణి



ప్రమాణస్వీకారం చేసిన యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వెనుకబడిన వడియరాజులను ఎస్టీ జాబితాలో చేర్చటం తమ కల అని, దాని సాధన కోసం అనేక ఉద్యమాలు చేశామని ఆంధ్రప్రదేశ్ వడ్డెర (వడియరాజుల) సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబీ రాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వడ్డెర (వడియరాజుల) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని ఏఐఎం ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడుగా తన్నీరు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బేబీరాణి మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నామని, ఏ ప్రభుత్వం వచ్చినా మమ్మల్ని రాజకీయంగా వాడుకుంటున్నారే తప్ప తమకు న్యాయం జరగడం లేదన్నారు. రాష్ట్రంలో తాము 40 లక్షల మంది జనాభా ఉన్నామని, 2014లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రాజకీయ అభివృద్ధిలో భాగస్వామ్యుల్ని చేయాలన్నారు. ఎస్టీ సాధన కోసం అనేక ఉద్యమాలు చేస్తున్నామని, 80 శాతం మంది వడ్డెర జాతికి సంబంధించిన నాయకులు కూటమి ప్రభుత్వం రావడానికి చాలా కృషి చేశారన్నారు. రాజకీయంగా వడ్డెర జాతికి ప్రాధాన్యత ఇవ్వా లని, ఒక రాజ్యసభ సీటు, మూడు ఎమ్మెల్సీలు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియను అమలుపరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాసరావు మాట్లాడుతూ వడ్డెర జాతి అభివృద్ధి కోసం అన్ని జిల్లాలు పర్య టిస్తానని, తమకు జరిగిన అన్యాయాన్ని వడ్డెర జాతి అంతా ఐక్యమై ప్రశ్నిస్తుందన్నారు. పల్నాడు జిల్లాలో నూతన కమిటీలు ఏర్పాటు చేసి ఎస్టీ సాధన కోసం ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డీ.వేలాద్రి, రాష్ట్ర కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఉప్పుతల దేవరాజ్, రాష్ట్ర యువజన విభాగ కన్వీనర్ దేరంగుల అంజి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాతర్ల మంజునాథ్, పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు వేముల శ్రీదేవి, సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు మన్నెం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పుడమి తల్లికి ‘పచ్చ’ బొట్టు



పాలువాయిగేటులో వరి నారు కట్టలు కడుతున్న కూలీలు



రెంటచింతల గ్రామంలో మాగాణిలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్



పాలువాయి గ్రామంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

మండలంలోని పలు గ్రామాలలో రైతులు ముమ్మరంగా వరినాట్లు చేపట్టారు. ఇప్పటి వరకు బోర్ల కింద, చెరువుల కింద ఉన్న ఆయకట్టు భూములలో నాట్లు వేశారు. ప్రస్తుతం భారీ వర్షాలకు కృష్ణానదికి లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటోంది. దీంతో పల్నాడు ప్రాంత రైతులు ఎంతో ఉత్సాహంతో వరి నాట్లలో నిమగ్నమయ్యారు. మంచికల్లు, పాలువాయిగేటు, రెంటాల, పాలువాయి, రెంటచింతల తదితర గ్రామాలలో దమ్ము పనులు చేపట్టారు. వరి నాట్లు వేస్తుండటంతో పుడమి తల్లికి పచ్చని బొట్టు పెట్టినట్టు ఆ దృశ్యాలు ఎంతో అందంగా కనిపించాయి. 95 శాతానికిపైగా మాగాణితో పల్నాడు కోనసీమగా పేరు పొందిన మంచికల్లు గ్రామంలో కూడా వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ ఖరీఫ్‌లో మండలంలోని 11 గ్రామాలలో మొత్తం 2,836 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి తెలిపారు.

- రెంటచింతల

# ఆట్యా- పాట్యా జిల్లా జట్టు ఎంపిక



పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

నకరికల్లు: పల్నాడు జిల్లా ఆట్యా- పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని పలు ఉన్నతపాఠశాలల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. న్యాయనిర్ణేతలు 15 మంది బాలికల, 15 మంది బాలురను పల్నాడు జిల్లా జట్టులో ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికై న క్రీడాకారులు రాణించి రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటాలని ఆట్యా-పాట్యా అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు చింతా సామ్రాజ్యం అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 9, 10వ తేదీలలో ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్‌లు చింతా పుల్లయ్య, జి.ఝాన్సీరాణి, తిరుమల బాయి, పి.తిరుపతిరావు, పెద్ద వెంకటేశ్వర్లు, అశోక్, పి.ఆంజనేయులు, షేక్.నాగూర్‌వలి, దరియావలి, వెంకటరమణ పాల్గొన్నారు.

**బాలికల జట్టులో..**

బి.సౌజన్య(వాగ్దేవి జూనియర్ కాలేజ్, నరసరావుపేట), షేక్ నజ్మ(వాగ్దేవి జూనియర్ కాలేజ్, నరసరావుపేట), షేక్ సుహానా మస్తాని(శ్రీ చైతన్య కళాశాల), కె.వైష్ణవి(జెడ్పీ హెచ్ఎస్, ఎస్.బి.పురం), డి.రంగ మహాలక్ష్మి(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), సీహెచ్ విజయ(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), ఎం.స్నేహ(శ్రీచైతన్య), ఎం.దివ్యసన్నిధి(జెడ్పీహెచ్ఎస్, కావూరు), షేక్.జి.సాధిక(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), టి.లిఖిత(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), బి.మేఘన(ఏపీ మోడల్‌స్కూల్, దేచవరం), కె.బుజ్జి(ఏపీ మోడల్‌కాలేజ్, దేచవరం), బి.ప్రమీల(జెడ్పీహెచ్ఎస్, కావూరు), పి.దీక్షిత(సింధూ స్కూల్), బి.స్వాతి ప్రియ(సింధూ స్కూల్) ఎంపికయ్యారు.

**బాలుర జట్టులో..**

షేక్ ఇస్మాయిల్(ఏపీ మోడల్ స్కూల్, దేచవరం), పి.వరప్రసాద్(జెడ్పీహెచ్ఎస్, ఎస్.బి.పురం), ఎం.వి.సాయిప్రదీప్(ఆక్స్‌ఫర్డ్ విట్, నరసరావుపేట), కె.శ్రీనివాస్(వాగ్దేవి జూనియర్ కళాశాల, నరసరావుపేట), టి.మణిదీప్(జెడ్పీహెచ్ఎస్, ఎస్.బి.పురం), షేక్ జాన్‌సైదా(ఆక్స్‌ఫర్డ్ విట్, నరసరావుపేట), ఆర్.లక్ష్మీనారాయణ(తిరుమల ఆక్స్‌ఫర్డ్), జి.లక్ష్మీప్రశాంత్(జెడ్పీహెచ్ఎస్, ఎస్.బి.పురం), ఎస్.సాయితేజ(ఆక్స్‌ఫర్డ్ విట్), బి.మణికంఠ(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), షేక్ నబీరసూల్(జెడ్పీహెచ్ఎస్,నకరికల్లు), డి.కోటేశ్వరరావు(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), వై.అఖిల్(జెడ్పీహెచ్ఎస్, నకరికల్లు), డి.శ్రీవెంకట అతులిత్(సింధూ స్కూల్), డి.ప్రసూన్(జెడ్పీహెచ్ఎస్, కావూరు) ఎంపికయ్యారు. ప్రతి జట్టులోను అదనంగా స్టాండ్‌బైలో ఐదుగురు చొప్పున ఎంపిక చేశారు.



# టీడీపీ నుంచి మొగల్ జాన్‌ను సస్పెండ్ చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య
- దొడ్లేరులో ప్రదర్శన, రాస్తారోకో



దొడ్లేరులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రైతులు నష్టపోయిన బంగారాన్ని ఇప్పించాలంటూ రైతుల పక్షాన పోరాటం చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకుడు హనుమంతరావుపై దాడి చేయటాన్ని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి కృష్ణయ్య ఖండించారు. అధికార పార్టీకి చెందిన క్రోసూరు మండల అధ్యక్షుడు మొగల్ జాన్ దాడి చేయటం అధికార తెలుగుదేశం ప్రభుత్వం రైతుల పక్షాన పనిచేస్తుందా లేక దొంగల పక్షాన పనిచేస్తుందా, అటువంటి వ్యక్తిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులపై దాడులు చేస్తే వెన్నుచూపరని సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరంతర పోరాటం సాగిస్తారన్నారు. ఆదివారం దొడ్లేరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ దొడ్లేరు గ్రామస్తులు అనంతవరం మీదగా క్రోసూరు వెళ్లడానికి, ఆవులువారిపాలెం మీదుగా బెల్లకొండ వెళ్లడానికి పలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునరుద్ధరించాలని ఆర్ అండ్ బీ అధికారులను కలిసి గ్రామ ప్రజల సమస్యలను విన్నవించామన్నారు. అంతేకాకుండా సాగర్ కాలవ నీళ్ల చివరి ఆయకట్టు రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతులకు షరతులు లేకుండా రుణాలు కల్పించాలని, అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వై రాధాకృష్ణ, వై గోపాలరావు గద్దె చలమయ్య, ఆంజనేయులు నాయక్, జి మల్లేశ్వరి, డి విమల. పి మహేష్, అచ్చంపేట క్రోసూరు మండలాల రైతు సంఘం నాయకులు, హనుమంతరావు ఆవుల ఆంజనేయులు, ఆర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సీహెచ్ బాబూరావు
- స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పాతగుంటూరులో ప్రచారం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన నారా లోకేష్ టీడీపీ కూటమి సర్కారు గతంలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ప్రశ్నించారు. గుంటూరు నగరంలోని పాత గుంటూరు బాలాజీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. బాబురావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించిన టీడీపీ నేడు అధికారంలోకి వచ్చి స్మార్ట్ మీటర్లు వేగంగా ఏర్పాటు చేస్తూ ప్రజలపై భారాలు మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో ఆగస్టు 7వ తేదీన జరిగే పోరాటంలోనూ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు లక్కా అరుణ, బి.ముత్యాలరావు, ఎం.ఎ. చిష్టీ, పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బోధనేతర విధులు తగదు

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. ఎస్టీయూ ప్రాంతీయ శాఖ సమావేశం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధ్యాయులనుయాప్‌ల ద్వారా అనేక రకాల సమాచారం అందించాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడం తగదన్నారు. బియ్యం, సరుకులు, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వంటివి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తెచ్చుకోవడం వంటి పనుల నుంచి మినహాయించాలన్నారు. ప్రతి ఒక్క పనిని అత్యవసరం అంటూ వేధించటం తగదని, సర్వర్ పనిచేయకపోవడంతో మోగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌కు సంబంధించిన ఫొటోలు ఇప్పటికీ అప్‌లోడ్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క బోధన చేస్తునే ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేయాలనడం తగదన్నారు. ఆగస్టు నాలుగు నుంచి ఎఫ్ఏ -1 పరీక్షలు ఉన్నందున సిలబస్ పూర్తి చేయాల్సిన సమయంలో యాప్‌ల భారంతో ఉపాధ్యాయులు సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బి.అక్కయ్య, ఎం.కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, మగ్బూల్‌బాషా, దుర్గాప్రసాద్, కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.